JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | గురువారం 23-04-2026
Medchal - Malkajgiri | Thursday 23-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 326
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 326 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# ఆ నిషేధం ఎత్తివేయండి



- తర్వాత చర్చలు గురించి మాట్లాడదాం
- ట్రంప్‌కు ఇరాన్ దిమ్మతిరిగే షరతు

**జయభేరి, న్యూఢిల్లీ:**

అమెరికా ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మరో కీలక మలుపు తిరిగాయి. ఇరాన్‌తో యుద్ధాన్ని నివారించేందుకు పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న శాంతి చర్చలకు హాజరయ్యే విషయంలో టెహ్రాన్ అత్యంత కఠినమైన షరతును విధించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా సైన్యం విధిస్తున్న నావికా దళ దిగ్బంధనాన్ని తక్షణమే ఎత్తివేస్తేనే తామ చర్చల బల్ల ముందుకు వస్తామని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ స్పష్టం చేశారు. అమెరికా ఒకవైపు కాల్పుల విరమణను పొడిగిస్తూనే.. మరోవైపు ఓడరేవులను దిగ్బంధించడం 'యుద్ధ విరమణ నిబంధనలను ఉల్లంఘించడమే'నని ఆయన అభివర్ణించారు. శాంతిని కోరితే తాము సిద్ధమని, ఒకవేళ యుద్ధమే కావాలనుకుంటే దానికి కూడా ఇరాన్ వెనకాడదని ఆయన హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాకిస్థాన్ నాయకత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, ఇరాన్ ఉన్నతాధికారుల నుండి మాత్రం వ్యతిరేక సంకేతాలే అందుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ సలహాదారు మహ్దీ మొహమ్మదీ

...మిగతాది 2 లో



# బస్సుల కోసం.. పడిగాపులు

- బస్సులు లేకపోవడంతో మెట్రో స్టేషన్లలోనూ ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది
- బస్సులు నడవకపోవడంతో సామాన్య ప్రయాణికులు తీవ్ర అవస్థలు
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని, 2021, 2025 పేస్కేల్లను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 22 :**

తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టడంతో రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ప్రభుత్వం నియమించిన కమిటీతో టీజీఎస్ఆర్టీసీ జేఏసీ (JAC) జరిపిన చర్చలు విఫలం కావడంతో, హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లోనూ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సికింద్రాబాద్ వంటి ప్రధాన బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. ఎల్బీనగర్ వంటి రద్దీ ప్రాంతాలలో ప్రయాణికులు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో మెట్రో స్టేషన్లలోనూ ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా నాగోల్, బండ్లగూడ, జీడిమెట్ల డిపోల వద్ద సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. జీడిమెట్ల డిపోలో మొదటి షిఫ్ట్‌లో 132 బస్సులు ఉండగా, భారీ పోలీస్ బందోబస్తు మధ్య కేవలం 3 బస్సులను మాత్రమే ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో బయటకు పంపగలిగారు. డిపోల వద్ద కార్మికులు బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని, 2021, 2025 పేస్కేళ్లను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, రవాణా, ఆర్థిక మంత్రులు ఈ విషయంలో తక్షణమే చొరవ చూపాలని జేఏసీ కోకన్వీనర్ కత్తుల యాదయ్య డిమాండ్ చేశారు. మరోవైపు, బస్సులు నడవకపోవడంతో సామాన్య ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆటో డ్రైవర్లు అదను చూసి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్నిచోట్ల అతి తక్కువ సంఖ్యలో నడుస్తున్న బస్సుల్లో జనం కిక్కిరిసి ప్రయాణిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. జీడిమెట్ల డిపో వద్ద జరిగిన ధర్నాలో జేఏసీ నాయకులు ఎం.రాజు, గోవర్ధన్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొని, తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ యూనియన్ నాయకులు చక్రవర్తి మాట్లాడుతూ.. 'ఆర్టీసీ కార్మికుల సమ్మె


...మిగతాది 2 లో



# MOU లు, పురోగతిపై ఆరా..

*పరిశ్రమల శాఖ పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించాను. దావోస్ పర్యటనలో, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పలు కంపెనీలతో జరిగిన MOU లు, పురోగతిపై ఆరా తీశాను. ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నాను.*

MOU లు కుదుర్చుకున్న కంపెనీలను మూడు కేటగిరీలుగా వర్గీకరించి, ప్రాధాన్యత క్రమంలో భూ కేటాయింపులు, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టాలని ఆదేశించాను. డేటా సెంటర్లకు ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించాను. MOU లు కుదుర్చుకున్న సంస్థలు వీలైనంత త్వరగా తమ కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించాను. ఈ సమీక్షలో పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# కాళేశ్వరం విచారణ నివేదికపై స్టే

- వాళ్లిద్దరిపై చర్యలు వద్దు.. హైకోర్టు ఆదేశం
- ఘోష్ కమిషన్ నివేదిక పై హైకోర్టు స్టే ను స్వాగతిస్తున్నాం
- కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంప పెట్టు

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 22 :**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావుతో పాటు మరో ఇద్దరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. విచారణ కమిషన్ చట్టం కింద నిర్దేశించిన సరైన ప్రక్రియను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ సీఎస్ ఎస్.కె. జోషి, ప్రస్తుత ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయలేదని, తమ వాదనలు వినకుండానే

...మిగతాది 2 లో

## ఎవరు ఔనన్నా కాదన్నా కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం

- ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం
- సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని మరోసారి నిరూపితమైంది.. హరీశ్

# కుమార్తె ప్రవర్తనపై అనుమానం



- ప్రేమపేరుతో యజమాని కూతురితో వ్యవహారం
- కిలో బంగారం నొక్కేసిన యువకుడు
- చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 22 :**

నమ్మకంగా పనిచేస్తున్నాడనుకున్న వ్యక్తే యజమాని కుటుంబానికి తీరని ద్రోహం చేశాడు. ప్రేమ పేరుతో యజమాని కుమార్తెను వంచించి, ఆమె నుంచి ఏకంగా కిలో బంగారు ఆభరణాలను కాజేశాడు. బ్రెయిన్ ట్యూమర్ అంటూ నాటకమాడి ఈ భారీ మోసానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## బస్సుల కోసం.. పడిగాపులు

మొదలుకావడంతో జూబ్లీ బస్ స్టేషన్ లో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కంటోన్మెంట్, పికెట్ డిపోలలో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉత్తర తెలంగాణ కు వెళ్లాల్సిన బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఆర్టీసీ కార్మికుల సమస్యలను త్వరగా తీర్చాలని' కోరారు . మహాలక్ష్మి పథకం విజయవంతం కావడానికి ఆర్టీసీ కార్మికులే కారణమని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించాలని అన్నారు. గతంలో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఆర్టీసీలో పని చేసే వారికి పిఆర్సి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చలేదని ఇదే విషయమే పలుమార్లు అధికారులతో చర్చలు జరిగినప్పటికీ విఫలం కావడంతో తాము 45 రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెకు దిగినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కాళేశ్వరం విచారణ నివేదికపై స్టే

కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన నివేదికను 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు కేసీఆర్, హరీశ్ రావు సహా అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికలో పేర్కొంది.పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరఫున సీనియర్ కౌన్సిల్ ఎస్. నిరంజన్ రెడ్డి వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నలుగురు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు ప్రారంభించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు రాజ్యాంగబద్ధమే**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలపై రాజకీయ దుమారం మొదలైంది. పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు స్టే విధించింది. ఈ కేసులో ఆరోపణలు ఎందుర్కొంటున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులపై తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ నేత, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం విచారణ నివేదికపై స్టే విధిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో బీఆర్ఎస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై అద్దంకి దయాకర్ మండిపడ్డారు. ఈ తీర్పు వల్ల బీఆర్ఎస్‌కు ఒరిగేదేమీ లేదని ఆయన అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు రాజ్యాంగబద్ధమేనని కోర్టు అంగీకరించిందని, కేవలం తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మాత్రమే చెప్పిందని ఆయన గుర్తు చేశారు. దీన్ని చూసి బీఆర్ఎస్ నేతలు 'చంకలు గుద్దుకోవడం' హాస్యాస్పదమన్నారు. త్వరలోనే సీబీఐ నివేదిక కూడా వస్తుందని, అప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టులోని అసలు వాస్తవాలు, అవినీతి భాగోతం బయటపడతాయని తెలిపారు. బీజేపీతో కలిస్తే తమ తప్పులు మాఫీ అవుతాయని వారు భావిస్తున్నారని... హరీశ్ రావు ఢిల్లీలో ప్రదక్షిణలు చేయడం వెనుక ఆంతర్యం ఇదేనని ఆరోపించారు. కానీ తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

## ఆ నిషేధం ఎత్తివేయండి

అమెరికా వైఖరిని ఎద్దేవా చేస్తూ, "ఓడిపోతున్న పక్షం షరతులు విధించదు" అని వ్యాఖ్యానించారు. ఈ కాల్పుల విరమణ పొడిగింపు అనేది ఇరాన్‌పై ఆకస్మిక దాడి చేసేందుకు సమయం కొనుగోలు చేసే ఒక కుతంత్రమని టెహ్రాన్ బలంగా అనుమానిస్తోంది. అమెరికా యొక్క అస్థిర వైఖరి, అవాస్తవిక డిమాండ్లు మరియు నిరంతర వైరుధ్యాల కారణంగానే తాము రెండో విడత చర్చల్లో పాల్గొనేందుకు సుముఖంగా లేమని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇస్లామాబాద్‌లో జరగాల్సిన ఈ చర్చలపై అనిశ్చితి నీడలు కమ్ముకున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, వారి ప్రతినిధి బృందం పాకిస్థాన్ పర్యటనను వైట్ హౌస్ ప్రస్తుతానికి నిలిపివేసింది. అయినప్పటికీ, పాకిస్థాన్ ప్రభుత్వం మాత్రం శాంతి చర్చల కోసం అత్యున్నత స్థాయి భద్రతా ఏర్పాట్లు చేసింది. ఇస్లామాబాద్, రావల్పిండి పరిసర ప్రాంతాల్లో దాదాపు 20,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించింది. పాకిస్థాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ చేస్తున్న రాయబార ప్రయత్నాలు ఫలించాలంటే, అమెరికా దిగ్బంధనాన్ని సడలించాలని Iran పట్టుబడుతోంది. ఈ పరిణామాలు గమనిస్తే, కాల్పుల విరమణ పొడిగించబడినప్పటికీ, దిగ్బంధనం కొనసాగినంత కాలం చర్చలు పట్టాలెక్కడం కష్టమనిపిస్తోంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ 'మైండ్ గేమ్' అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.

## కుమార్తె ప్రవర్తనపై అనుమానం

గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి చైతన్యపురిలో టైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన వద్ద 34 ఏళ్ల సాగర్ గత నాలుగేళ్లుగా మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. నమ్మకంగా ఉంటూ యజమాని కుటుంబంతో కలిసిపోయాడు. ఈ క్రమంలోనే యజమాని కుమార్తెతో పరిచయం పెంచుకుని, ఆమెను ప్రేమ పేరుతో తనవైపు తిప్పుకున్నాడు. సాగర్‌కు అప్పటికే పెళ్లయ్యి ఒక పాప కూడా ఉండటం.. ఇంట్లో ఒకడిలా చూసుకుంటుండటంతో యజమానికి అతడి ప్రవర్తన పట్ల అనుమానం రాలేదు. కొంతకాలం తర్వాత తన పథకాన్ని అమలు చేయడం మొదలుపెట్టాడు. తనకు బ్రెయిన్ ట్యూమర్ ఉందని, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానంటూ ఆమె ముందు కన్నీటిపర్యంతమయ్యాడు. అతని మాటలను పూర్తిగా నమ్మిన ఆ యువతి, ప్రియుడిని కాపాడుకోవాలని నిర్ణయించుకుంది. ఇంట్లో ఎవరికీ తెలియకుండా లాకర్‌లో ఉన్న కిలో బంగారు ఆభరణాలను తీసుకెళ్లి అతనికి ఇచ్చింది. ఆ బంగారంలో కొంత అమ్మి అప్పులు తీర్చుకున్న సాగర్, మిగిలిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడపడం ప్రారంభించాడు. ఖరీదైన దుస్తులు, వస్తువులు కొంటూ తన జీవనశైలిని మార్చుకున్నాడు. ఇదిలా ఉంటే.. ఈ నెల 17న వ్యాపారి కుటుంబం తమ సొంతూరు వెళ్లేందుకు సిద్ధమవుతూ లాకర్‌ను పరిశీలించగా, కిలో బంగారం కనిపించకపోవడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులను విచారించగా, కుమార్తె ప్రవర్తనపై అనుమానం వచ్చింది. ఆమెను లోతుగా ప్రశ్నించడంతో అసలు విషయం వెల్లడించింది. ఆమె ఇచ్చిన సమాచారంతో పోలీసులు నిందితుడు సాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 20 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కోదాడలో బస్ డిపో వద్ద ఆందోళన

కోదాడ బస్ డిపో వద్ద సమ్మె కారణంగా బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారుఏ. బస్ డిపో నుంచి బస్సులు వెళ్లకుండా పోలీస్ పహారాలో బస్సులు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆర్టీసీ కార్మికులు బస్సులకు అడ్డంగా నిలిచారు. బస్సులను డిపోల నుండి బయటకు వెళ్ళనివ్వకుండా సమ్మెకు దిగారు. పోలీసులు కార్మికులను పక్కకు తొలగించి బస్సులను బలవంతంగా బయటకు పంపించారు. తమ సమ్మెను తాము చేస్తూనే ఉంటామని సమ్మె కొనసాగిస్తున్నారు.

# భారత్ లో పెరుగుతున్న ఆటమ్నల్ రొమాన్స్

> ఒకప్పుడు అరవై ఏళ్లు వచ్చాయంటే... ఆధ్యాత్మిక చింతన, మనవలు, మనవరాళ్లతో కాలక్షేపం, విశ్రాంతి జీవితం మాత్రమే గుర్తుకు వచ్చేది. కానీ ఆధునిక భారత వృద్ధతరం మాత్రం నాకొక గాల్ ఫ్రెండ్ కావాలిరా అంటూ పాడుకుంటున్నారు. యూత్‌తో పోటీ పడి మరీ డేటింగ్ యాప్‌ల్లో ఖాతాలు తెరుస్తున్నారు. ప్రేమ, తోడు కోసం సెకండ్ ఇన్నింగ్స్ కోసం అడుగులు వేస్తున్నారు.



విదేశాల్లో సాధారణమైన ఆటమ్నల్ రొమాన్స్ అంటే మలి వయసు ప్రేమ ఇప్పుడు భారత్‌లో కూడా చాలా వేగంగా విస్తరిస్తోంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా వంటి మెట్రో నగరాల్లో వృద్ధుల కోసం ప్రత్యేకంగా సింగిల్ మిక్సర్స్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ వారు రిటైర్‌మెంట్ ప్లాన్లు, ఆరోగ్య విశేషాలు చర్చించుకుంటూనే తమకు నచ్చిన తోడును ఎంచుకుంటున్నారు. భారత్‌లో సగటు ఆయుర్దాయం 50 నుంచి 71 ఏళ్లకు పెరిగింది. అంటే రిటైర్‌మెంట్ తర్వాత కూడా సుమారు రెండు దశాబ్దాల జీవితం మిగిలే ఉంటోంది. పిల్లలు విదేశాల్లో లేదా ఇతర నగరాల్లో స్థిరపడటం వల్ల సుమారు 15 శాతం మంది వృద్ధులు నగరాల్లో ఒంటరిగా ఉంటున్నారు. ముఖ్యంగా కోవిడ్ తర్వాత ఒంటరిగా ఉండటం మానసిక ఆందోళనలు, డిప్రెషన్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. వీటిపై అవగాహన పెరిగింది. కేవలం శారీరక ఆకర్షణ కంటే, మనసు విప్పి మాట్లాడే ఒక తోడు ఉండాలనే కోరిక వారిని ఈ దిశగా నడిపిస్తోంది. " మేం కూడా సంతోషంగా ఉండటానికి అర్హులమే" అనే భావన ఇప్పుడు బలపడుతోంది.

ప్రముఖ నటుడు ఆశిష్ విద్యార్థి 57 ఏళ్ల వయసులో రూపాలి బరువాను వివాహం చేసుకున్నారు. జీవితంలో ఏ దశలోనైనా తోడు అవసరమని, సంతోషంగా ఉండే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని ఆయన చెప్పుకొచ్చారు. వారిద్దరూ కలిసి ఫిఫ్టీ ప్లస్ జిందగీ అనే యూట్యూబ్ ఛానెల్ ద్వారా తమ ప్రయాణాన్ని పంచుకుంటున్నారు. బాలీవుడ్ నటి సుహాసిని ములే 60 ఏళ్ల వయసులో వివాహం చేసుకున్నారు. ఫేస్‌బుక్ ద్వారా పరిచయం అయిన ఒక శాస్త్రవేత్తను పెళ్లి చేసుకున్నారు. సమాజం ఒత్తిడి వల్ల కాకుండా, తనకు తోడు కావాలని అనిపించినప్పుడు మాత్రమే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. సెలబ్రిటీలే కాకుండా సామాన్యులు కూడా ఈ బాటలో ఉన్నారు. కేరళకు చెందిన గోకుల్ శ్రీధర్ అనే వ్యక్తి తన తల్లి పడుతున్న కష్టాలు చూసి పునర్వివాహం చేశాడు. ఇది 2013లో సంచలనంగా మారింది. కునాల్ అశోక అనే ఇద్దరు బాల్య స్నేహితులు సుమారు 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. అప్పటికే వారి భాగస్వాములను కోల్పోయారు. చివరకు 2023లో వాళ్ల 60వ ఏట వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. టెక్నాలజీ కేవలం యువతకే కాదు, వృద్ధులకు కూడా వరంగా మారింది. నేడు భారతీయ వృద్ధులు ఉపయోగిస్తున్న టాప్ యాప్‌లు ఒకసారి పరిశీలిస్తే ఆసక్తికరంగా ఉంటుంది. 50 ప్లస్ క్లబ్‌ను కేవలం వీళ్ల కోసమే రూపొందించారు. ట్రూలీ మాడ్లీ ఏ యాప్ కూడా 50 ప్లస్ వాళ్లకు క్రియేట్ చేశారు. ఇందులో సబ్‌స్క్రిప్షన్‌లు కోవిడ్ తర్వాత భారీగా పెరిగింది. క్వాక్‌క్వాక్ అండ్ బాంబుల్ అనే యాప్ ప్రాంతీయ భాషల్లో సపోర్ట్ చేస్తుంది.

అందుకే ఇందులో ఉండే వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అయితే డేటింగ్ యాప్‌లలో పురుషులు ఎక్కువగా యూజ్ చేస్తున్నారు. మహిళలు నేరుగా మిక్సర్స్, సిర్ఫ్ కాఫీ వంటి వెరిఫైడ్ సర్వీస్‌లను ఇష్టపడుతున్నారువాడేంటో అప్పుడే బట్టతల వచ్చేసింది. ఇంత తొందరగా ముసలాడు అయిపోయాడు" అని కామెంట్స్ చేస్తుంటారు. కొందరైతే మరీ దారుణంగా బాడీషేమింగ్ చేస్తారు. రియాల్టీ ఏంటంటే ప్రతి ఒక్కరూ లైఫ్‌లో ముసలోళ్లు అవుతారు. కానీ...అందరికీ ఈ వృద్ధాప్యం రెండు సార్లు వస్తుందట. ఇటీవల జరిగిన ఓ రీసెర్చ్‌లో ఇదే విషయం వెల్లడైంది. సాధారణంగా రిటైర్ అయ్యే ఏజ్ వస్తే అప్పుడు ముసలితనం వచ్చేసినట్టు భావిస్తుంటాం. కానీ... అంత కన్నా ముందు నుంచే మన శరీరంలోని కణాల్లో శక్తి తగ్గిపోతుంది. 2575 ఏళ్ల మధ్యలో ఉన్న వాళ్ల శరీరాల్లోని కణాల పని తీరుని ట్రాక్ చేశారు. ఆ క్రమంలోనే చాలా మందిలో 44 ఏళ్ల నుంచే కణాల్లో వృద్ధాప్య ఛాయలు కనిపించడం మొదలైంది. 60 ఏళ్లకు పూర్తి స్థాయిలో వృద్ధాప్యం వచ్చేసిందని గుర్తించారు. అంటే దాదాపు రెండు సార్లు ముసలితనం వచ్చేసినట్టే లెక్క. ఇలా శరీరంలోని కణాల్లో శక్తి మెల్లగా తగ్గిపోవడాన్నిలైనర్ ఏజింగ్ గా చెబుతున్నారు పరిశోధకులు. సాధారణంగా 40 ఏళ్లు వచ్చాక మహిళల్లో మెనోపాజ్ ఆగిపోతుంది. అప్పటి నుంచే వాళ్లకు వృద్ధాప్యం వచ్చినట్టు పరిగణిస్తారు. అయితే...పురుషుల్లోనూ 40 ఏళ్లు దాటాక ఇదే పరిస్థితి వస్తున్నట్టు ఈ పరిశోధన వెల్లడించింది. 44 ఏళ్లకు ఎప్పుడైతే వృద్ధాప్యం మొదలవుతుందో అప్పటి నుంచి గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉంటుందని ఈ రీసెర్చ్ స్పష్టం చేసింది. మద్యం సేవించే వాళ్లకు ఈ ముప్పు మరింత ఎక్కువ. ఇదే వయసులో మిగతా వ్యాధులు వచ్చేందుకూ ఆస్కారముంటుంది. 40 59 మధ్య వయసున్న వాళ్లలో 40% మందికి హార్ట్ అటాక్‌లు వచ్చే అవకాశముందని వివరించింది. 60 ఏళ్లు దాటాక ఈ రిస్క్ 75% వరకూ పెరుగుతుందని తేల్చి చెప్పింది. సరిగ్గా ఇదే వయసులో పార్కిన్‌సన్, అల్జీమర్స్ లాంటి వ్యాధులూ అటాక్ చేసే ప్రమాదముంది. 40 ఏళ్లు దాటగానే కొందరిలో చర్మం ముడతలుబడిపోతుంది. అదే వృద్ధాప్యానికి సంకేతం. ఈ వయసులోనే మోకాళ్ల నొప్పులు మొదలవుతాయి. గాయాలైతే అవి మానడానికీ చాలా సమయం పడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం..అంతర్జాతీయంగా 40 ఏళ్లకే వృద్ధాప్యం వస్తున్న దాఖలాలు పెరుగుతున్నాయి. పైగా ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. 2019లో 60 ఏళ్లకు వృద్ధాప్యం వచ్చిన వాళ్ల సంఖ్య 100 కోట్లుగా ఉండగా 2030 నాటికి ఇది 140 కోట్లకి, 2050 నాటికి 200 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది.

# నిలిచిన ప్రగతి రథ చక్రం




- డిపోలకే పరిమితమైన 6000 బస్సులు
- 60 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 22 :**

తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు బుధవారం సమ్మె బాట పట్టారు. ప్రభుత్వంతో నిర్వహించిన చర్చలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, మంగళవారం అర్ధరాత్రి నుంచే కార్మికులు తమ విధులను బహిష్కరించారు. ఈ సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పలు జిల్లాల్లో బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పరిస్థితిని అదుపులో ఉంచడానికి ప్రభుత్వం అన్ని ప్రధాన బస్ డిపోల వద్ద భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల తెలంగాణ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, ఉద్యోగులందరూ సమ్మె ఆలోచన విరమించి విధులకు హాజరుకావాలని సంస్థ TGRTC ఎండీ వై. నాగిరెడ్డి పిలుపునిచ్చారు. కార్మికుల డిమాండ్లపై సమగ్రంగా చర్చించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఐఏఎస్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ కమిటీ ఇప్పటికే మంగళవారం కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన వివరించారు. కార్మికులు లేవనెత్తిన డిమాండ్లలో కొన్ని ఆర్థికపరమైనవి, సాంకేతిక చిక్కులతో కూడిన అంశాలు ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాలను అన్వేషించడానికి ప్రభుత్వానికి కనీసం 4 వారాల సమయం అవసరమని నాగిరెడ్డి పేర్కొన్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున, ప్రభుత్వం కోరిన గడువుకు సహకరించాలని ఆయన కోరారు.అయితే కొన్ని సంఘాలు వాస్తవాలను పక్కనబెట్టి, సమ్మె పేరుతో కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడి ప్రయాణించే దినసరి కూలీలు, సామాన్య ప్రజలు మరియు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని ఆయన హితవు పలికారు. సంస్థ ప్రయోజనాలను, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా విధుల్లో పాల్గొనాలని ఎండి నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ సమ్మె.. కార్మికులు ఏం డిమాండ్ చేస్తున్నారు

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్ర రూపం దాల్చింది. ఈ సమ్మెలో కార్మికుల ప్రధాన డిమాండ్ ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయడం. సంస్థను కేవలం ఒక కార్పొరేషన్‌గా కాకుండా ప్రభుత్వ శాఖగా గుర్తించి, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. దీనితో పాటు 2021 నుండి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరుతున్నారు. ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ, సంస్థే నేరుగా కొత్త బస్సులను కొనుగోలు చేయాలని జేఏసీ స్పష్టం చేస్తోంది.సమ్మెను అడ్డుకునేందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలం కాలేదు. ప్రభుత్వం జీవో నంబర్ 66 ద్వారా ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, జేఏసీ నాయకులు దానిని ససేమిరా తిరస్కరించారు. కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, తమ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదని జేఏసీ చైర్మన్ ప్రకటించడంతో సమ్మె అనివార్యమైంది.ఈ సమ్మె ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులపై పడనుంది. దాదాపు 6,000 బస్సులు డిపోలకే పరిమితం కావడంతో హైదరాబాద్ సిటీ బస్సులతో పాటు జిల్లాలకు వెళ్లే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిలిచిపోనున్నాయి. నిత్యం ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. చివరకు ఎయిర్‌పోర్ట్ పుష్పక్ సర్వీసులు కూడా నిలిచిపోవడంతో విమాన ప్రయాణికులకు సైతం కష్టాలు మొదలయ్యాయి.ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ప్రైవేట్ వాహనాలు, పాఠశాల బస్సులను తాత్కాలికంగా ప్రయాణికుల కోసం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల సహాయంతో కొన్ని బస్సులను నడపాలని ప్రభుత్వం భావిస్తోంది.




# ఎవరు ఔనన్నా కాదన్నా కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం

- ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం
- సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని మరోసారి నిరూపితమైంది.. హరీశ్ రావు

**జయభేరి, హైదరాబాద్ :**

ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఏవరు ఔనన్నా కాదన్నా, ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం. జై తెలంగాణ జై కేసీఆర్ అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు కష్టాల ప్రభుత్వం

- RTC కార్మికుల పోరాటానికి BJP సంపూర్ణ మద్దతు
- చెంగిచెర్ల, ఉప్పల్ డిపో కార్మికులతో కలిసి సంఘీభావం
- హామీలు అమలు చేయాలని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు - సుదర్శన్ రెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగుడ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జెపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన RTC కార్మికుల మద్దతు కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెంగిచెర్ల డిపో, ఉప్పల్ డిపోకు చెందిన RTC కార్మికులతో కలిసి పాల్గొని, వారి సమస్యలను తెలుసుకుని సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, “కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు కష్టాల ప్రభుత్వంగా మారింది” అని తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయలేదని, వెంటనే వాటిని నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. RTC కార్మికులు న్యాయమైన హక్కుల కోసం చేస్తున్న ఈ సమ్మెకు భారతీయ జనతా పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఆర్టీసి సంస్థను బలోపేతం చేయాలంటే కార్మికుల సంక్షేమాన్ని ముందుగా పరిగణలోకి తీసుకోవాలని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంస్థ నష్టపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులపై పెరుగుతున్న ఒత్తిడి, వేతన సమస్యలు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి అంశాలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**RTC కార్మికుల ప్రధాన డిమాండ్లు:**

RTC ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. 2021 వేతన సవరణను 30% ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి, అలాగే 2025 వేతన సవరణ కూడా అమలు చేయాలి. పెన్షన్, PF బకాయిలు చెల్లించి కనీసం ₹400 కోట్లు RTCకి కేటాయించాలి. ఉద్యోగ భద్రత కల్పించి, ప్రైవేటీకరణను పూర్తిగా నిలిపివేయాలి. డ్రైవర్, కండక్టర్లపై ఉన్న ఒత్తిడిని తగ్గించి సౌకర్యాలు కల్పించాలి. KMPL, EPK కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలులో అవకతవకలు నిలిపివేయాలి. డిపో స్థాయిలో మౌలిక వసతులను మెరుగుపరచాలి. టికెట్ ఇన్స్పెక్టర్లపై ఉన్న అనవసర ఒత్తిడిని తగ్గించాలి. మహిళా కార్మికులకు భద్రత, సదుపాయాలు కల్పించాలి. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి. యూనియన్ ఎన్నికలను తక్షణం నిర్వహించాలి. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో RTC కార్మికులు పాల్గొన్నారు.



## తుంకుంటలో ఎస్‌కేఎం బార్ & రెస్టారెంట్ ప్రారంభం

- యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలన్న కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 22 :**

నేటి యువత ఉద్యోగాల కన్నా స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. శామీర్ పేట డివిజన్ పరిధిలోని తుంకుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ కె ఎం బార్ అండ్ రెస్టారెంట్ ను వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎం. సూర్యప్రకాష్ రెడ్డి, ఎస్. ప్రవీణ్ రెడ్డి, జి. భరత్ రెడ్డి, యస్. రాజశేఖర్ రెడ్డి, డి. వంశీధర్ రెడ్డి, జి. శ్రీకర్ గౌడ్ లను వారు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పుడున్న రోజుల్లో యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాల వైపు అడుగులు వేస్తున్నారని, ఇది శుభ పరిణామం అని పేర్కొన్నారు. అంతే కాక ఇలాంటి వ్యాపారాల వలన స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంపొందుతాయని అభిప్రాయ పడ్డారు. అంతేకాక వీరి వ్యాపారం మరింత ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. కాగా ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు నక్క సందీప్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, గూడూరు మోహన్ రెడ్డి, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, మన్నె బిక్షపతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## మన్యంకొండలో ఘనంగా శ్రీమన్ రామానుజాచార్యుల జయంతి వేడుకలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీమన్ రామానుజాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త,చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈవో శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య పర్యవేక్షకుడు నిత్యానంద చారి, దేవస్థానం పురోహితులు, సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ నేతల మద్దతు




**జయభేరి, మేడిపల్లి :**

ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవ్వడంతో కార్మిక జేఏసీ సమ్మెకు పిలునిచ్చిన నేపథ్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని ఉప్పల్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి పలు కీలక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. సంస్థ బలోపేతానికి ఆర్థిక సహాయం అందించడం, ఉద్యోగుల జీతాల పెంపు, పెండింగ్ సమస్యల పరిష్కారం, కొత్త బస్సుల కొనుగోలు, డిపోల అభివృద్ధి వంటి చర్యలతో ఆర్టీసీని కాపాడారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని వారు విమర్శించారు. వెంటనే ఆర్టీసీ ఉద్యోగులతో చర్చలు జరిపి, వారి డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొడె పోచయ్య, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, ఆకుల మధుకర్, కందుకూరి ఆంజనేయులు, బుల్లెట్ శంకర్, అశోక్ రెడ్డి, సతీష్, శ్రీ రాములు గౌడ్, అశోక్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ గౌడ్, శ్రీకాంత్, అమర్ పటేల్, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెల్పిన డా. కాళీ ప్రసాద్

**జయభేరి, పరకాల, ఏప్రిల్ 22:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం, యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్త కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె కార్యక్రమంలో భాగంగా పరకాల బస్ డిపో దగ్గర నిర్వహించిన సమ్మెలో పాల్గొని ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కాంటెస్ట్ ఎమ్మెల్యే, డా.పగడాల కాళీ ప్రసాద్ రావు. ఈ సందర్భంగా డా.పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేసి, ఉద్యోగులకు ప్రభుత్వ హోదా కల్పించాలని, కార్మిక యూనియన్లను తక్షణమే పునరుద్ధరించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 90 పైగా డిపోల వద్ద కార్మికులు శాంతియుతంగా నిరసనలు తెలుపుతారు. ప్రభుత్వం అధికారికంగా చర్చలకు పిలిచే వరకు సమ్మె కొనసాగుతుంది అని అన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తోందని, కమిటీల పేరుతో సమస్యలను పక్కదారి పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులకు కలిగే ఇబ్బందులకు ప్రభుత్వం, యాజమాన్యమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్, కార్మిక నాయకుల తో పాటు హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి మేఘనాథ్, పరకాల 12,15వ వార్డ్ కౌన్సిలర్లు కుక్కల విజయ్, ఆకుల లావణ్య శ్రీధర్, పరకాల రూరల్ మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, పరకాల పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు సంగా పురుషోత్తం,గుండె బోయిన నర్సయ్య, జంగిలి రాజేందర్ రావు బిజెపి నాయకులు మారేడుకొండ భాస్కరాచారి, ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, మెంతుల సురేష్, దంచనాధుల కిరణ్, కానుగుల గోపీనాథ్,చెంతన్ రెడ్డి, ముత్యాల దేవేందర్, కుంట మల్ల గణేష్, దామ సతీష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్ డిపో ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా సిపిఐ పార్టీ నాయకులు




**జయభేరి, మేడిపల్లి :**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు చేస్తున్నటువంటి సమ్మెకు మద్దతుగా మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో JAC ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిలవడం జరిగినది. రచ్చ కిషన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) కార్మికులు ఈరోజు నుండి నిరవధిక సమ్మెకు దిగారు. జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) మార్చి 13న సమ్మె నోటీసు ఇచ్చిన 41 రోజుల తర్వాత, ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. కార్మికుల యొక్క డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఆర్టీసీ కార్మికులకు నెరవేర్చాలని మరియు కార్మికులు ముఖ్యంగా — 2021 వేతన సవరణ 30% ఫిట్‌మెంట్‌తో అమలు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానత, పెండింగ్ బకాయిలు-పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపు, డ్రైవర్లు-కండక్టర్ల ఔట్‌సోర్సింగ్ నిలిపివేత, 2019 సమ్మె కేసుల ఉపసంహరణ, సస్పెండ్ అయిన కార్మికుల పునఃస్థాపన, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం అనే డిమాండ్లతో పోరాటం చేస్తున్నారు. కావున వారి డిమాండ్ల నెరవేర్చాలని వారి డిమాండ్ లో నెరవేరేవరకు సిపిఐ పార్టీ వెన్నంటే ఉండి సమ్మెలో వారికి పూర్తిగా మద్దతుగా ఉంటూ పోరాటం వారితో ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఏఐటీయూసీ డిప్యూటీ కార్యదర్శి దండు రమేష్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి సి హెచ్ మాధవి, బీసీ సంఘం జిల్లా నాయకురాలు కే ప్రమీల, బి కే యం య మండల కార్యదర్శి & అధ్యక్షులు కే మహాలక్ష్మి భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యురాలు ఏ రమాతార, సిపిఐ పార్టీ నాయకులు గణేష్, ఇస్తారి. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి పార్టీ కౌన్సిలర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్ 7వ వార్డుకు చెందిన బిజెపి పార్టీ కౌన్సిలర్ హేమలత బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసారి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు పార్టీ కండువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. అలాగే బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు నర్సింలు, సత్తయ్య, బాలరాజు, జైపాల్ లతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే భూత్పూర్ మండలం రావులపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ప్రవీణ్, వసంత లతోపాటు పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కూడా పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే జిఎంఆర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జిఎంఆర్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పరకాలలో ఖర్గే దిష్టిబొమ్మ దహనం



**జయభేరి, పరకాల ఏప్రిల్ 22:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పై “టెర్రరిస్ట్” అని అనుచితంగా, అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు ఆదేశాలనుసారం బుధవారం బిజెపి పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పరకాల కూరగాయల మార్కెట్ సర్కిల్ వద్ద ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉండి, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైనవిగా మేము తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి మేఘనాథ్ కౌన్సిలర్స్ కుక్కల విజయ్, ఆకుల లావణ్య శ్రీధర్, పరకాల రూరల్ మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్ పరకాల పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు సంగా పురుషోత్తం, గుండె బోయిన నర్సయ్య, జంగిలి రాజేందర్ రావు బిజెపి నాయకులు మారేడుకొండ భాస్కరాచారి ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, మెంతుల సురేష్, దంచనాధుల కిరణ్, కానుగుల గోపీనాథ్, చెంతన్ రెడ్డి, ముత్యాల దేవేందర్, కుంట మల్ల గణేష్, దామ సతీష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు

- బొచ్చు కళ్యాణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు



**జయభేరి, పరకాల, ఏప్రిల్ 22:**

బుధవారం పరకాల పట్టణం సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ కార్మికుల యొక్క న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని కళ్యాణ్ అన్నారు. కార్మికుల సంఘాలతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరిపింప చేయాలని ఆయన కోరారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించేంతవరకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ఇచ్చినట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## తెరుచుకున్న కేదార్నాథ్ ఆలయం

చార్ ధామ్ యాత్రలో కీలక ఘట్టం ప్రారంభమైంది. హిమాలయాల ఒడిలో కొలువైన పుణ్యక్షేత్రం కేదార్నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. అటు గడ్డకట్టే చలిని సైతం లెక్కచేయకుండా వేలాది భక్తులు శివయ్య ను దర్శించుకోవడానికి తరలివచ్చారు.

# దేవరకద్ర జిఎంఆర్ కు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

- ప్రతిరోజు ఎమ్మెల్యే గ్రామాలలో సుడిగాలి పర్యటనలు
- గ్రామాభివృద్ధి పైనే ప్రత్యేక దృష్టి
- ఎమ్మెల్యేకు బ్రహ్మ రథం పడుతున్న జనం
- ఎమ్మెల్యే పనితీరుకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న పలువురు నాయకులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రతిరోజు నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో సుడిగాలి పర్యటనలు జరుపుతున్నారు. అభివృద్ధి పైనే ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే జిఎంఆర్ కు నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ పనితీరుకు ఆకర్షితులై ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో చేరుతున్నారు. కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్న నాయకులను పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే జీఎంఆర్ స్వాగతం పలికి గ్రామాభివృద్ధికి తమకు సహకరించాలని కోరుతున్నారు. అందరం కలిసి గ్రామ అభివృద్ధికి పాటు పడదాం అంటున్నారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేద్దామంటున్నారు. రైతుల సమస్యల దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభిస్తున్నారు. తాము ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధి పొందాలని రైతులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచిస్తున్నారు. అలాగే ముమ్మరంగా ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాల్లో పాల్గొని ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఎమ్మెల్యే పర్యటన చూసి నియోజకవర్గ ప్రజలు ఆయనను అభినందిస్తున్నారు. ఆయన ఓపికకు సెల్యూట్ చేస్తున్నారు. అంతేకాకుండా తమ గ్రామానికి వచ్చే ఎమ్మెల్యే జిఎంఆర్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే జిఎంఆర్ కు గజమాలలు వేసి స్వాగతం పలుకుతున్నారు.నాయకుడా.. మజాకా.. అన్న చందంగా ఎమ్మెల్యే జిఎంఆర్ దేవరకద్ర నియోజకవర్గంలో తన మార్కును ప్రదర్శిస్తున్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు అవుతున్నారు. ప్రజల సమస్యలను స్వయంగా వారి వద్దకు వెళ్లి అడిగి తెలుసుకుంటున్నారు. ఇదంతా ఒకవైపు ఉంటే.. మరోవైపు... ప్రతిరోజు ప్రజలు ఎమ్మెల్యే జిఎంఆర్ నివాసమైన దమగ్నాపూర్ వద్దకు వెళ్లి తమ సమస్యలు వెళ్లబోసుకుంటున్నారు. అయితే ఎమ్మెల్యే జీఎంఆర్ వారి సమస్యలను ఎంతో ఓపికతో విని అప్పటికప్పుడే వాటి పరిష్కారానికి మార్గాలు చెబుతున్నారు.



## మహిళా సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జిఎంఆర్ భూమి పూజ

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్ మండలం సంకలమద్ది లో బుధవారం మహిళా సంఘం భవన నిర్మాణానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (,జిఎంఆర్) భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అలాగే అక్కడ వరి కొనుగోలు కేంద్రాన్ని కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. అంతేకాకుండా 44వ జాతీయ రహదారిపై వేముల స్టేజి సమీపంలో ఉడిపి శ్రీకృష్ణ ప్యూర్ వెజ్ రెస్టారెంట్ పూనః ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం జీన్గరాల, డోకూర్ గ్రామాలలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రారంభించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ లను కూడా ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోషక ఆహారంతో నే ఆరోగ్యమైన జీవితం

- విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అందజేత
- సీనియర్ అంగన్వాడీ టీచర్స్ పి.పద్మ,జి స్వరూప



**జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్22 :**

మండలం వేములపల్లి గ్రామంలో మూడు అంగన్వాడి సెంటర్ ల ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు వివిధ రకాల పోషక విలువలు కలిగిన పప్పు ధాన్యాలు ఆహార పదార్థాలను వారికి చూపిస్తూ వాటి విలువలను అవగాహన కల్పించారు ఈ సందర్భంగా సీనియర్ అంగన్వాడీ టీచర్ లు ప్రొద్దుటూరు పద్మ, గుమ్మడవెల్లి స్వరూప మాట్లాడుతూ పోషకాహారంతో ఆరోగ్యమైన సమాజం నిర్మాణం అవుతుందని అన్నారు, అంగన్వాడీలో విద్యాభ్యాస అయిపోయిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అందించారు పిల్లలు, గర్భిణీలు,బాలింతలు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు, అందుకోసమే ప్రభుత్వం అంగన్వాడి సెంటర్లను ఏర్పాటు చేసిందని అన్నారు అంగన్వాడి సెంటర్లను సద్వినియోగం చేసుకొని పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని భుజించి ఆరోగ్యంగా జీవించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న,తండా అంగన్వాడి టీచర్లు విమల, మంగ తాయి హెల్పర్స్ వెంకటమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అందజేత

- పెద్దమప్పరాం అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో



**జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్22 :**

మండలం పెద్ద ముప్పారం గ్రామంలో అంగన్వాడి సెంటర్ల ఆధ్వర్యంలో అక్షరాభ్యాస శిక్షణ అనంతరం పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అందించిన అంగన్వాడి టీచర్లు విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో మంచి స్థానాల్లో ఉండాలని ఒక ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రమాదేవి స్వరూప జ్యోతి పద్మ శాంత, హెల్పర్స్ పద్మ శిల్ప నరసమ్మ పూలమ్మ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల పనితీరు తోనే ప్రభుత్వానికి పేరు ఎమ్మెల్యే

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు పనిచేయాలి
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా బాధ్యతతో పనిచేయాలి
- ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే



**జయభేరి, పరకాల, ఏప్రిల్ 22:**

బుధవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ప్రభుత్వ అధికారులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అందించడంలో గ్రామపాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం అని, వారి పనితీరును బట్టి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు.



ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. క్రింది స్థాయి అధికారులతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలు అవుతాయని తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. అధికారులు బాధ్యతతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని,గ్రామంలోని ప్రధాన సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గంజాయి నిర్మూలన పై ప్రత్యేక శుద్ధ తీసుకోవాలని తెలిపారు.

## హిందూ ధర్మ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

- హిందువుల ఐక్యతే జాతీయ సమైక్యత

**జయభేరి, పరకాల, ఏప్రిల్ 22:**



పరకాల పట్టణంలో ఏప్రిల్ 28వ తేదీ మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో (పశువుల సంత) నిర్వహించనున్న హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి ఉపాధ్యక్షుడు మాదుగుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమానికి హాజరుకావాలని గందే వెంకటేశ్వర్లు, మాజీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌ను హిందూ సమ్మేళనం శాలువాతో సత్కరించి కరపత్రమును అందజేస్తూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరచడం ద్వారా దేశాన్ని తిరిగి విశ్వగురువుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవాలంటే హిందువుల ఐక్యత అత్యంత అవసరమని పేర్కొన్నారు. హిందూ సమాజంలో గౌరవం, సేవాభావం, సంస్కృతి పరిరక్షణ వంటి విలువలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ మహత్తర కార్యక్రమంలో హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆకాల వర్షంతో వరి పంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**జయభేరి, కొండమల్లేపల్లి :**

అకాల వర్షంతో వరి పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి అని మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొండమల్లెపల్లి మండలం చెన్నారం గ్రామంలో అకాల వర్షంతో వరి పంట ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నష్ట పరిహారం అందించాలని ఆయన కోరారు. నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు అందించాలని ఆయన కోరారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడం జరిగింది అని ఆయన గుర్తు చేశారు. రైతులకు బిఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసి రామ్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ హైకోర్టు తీర్పు పట్ల హర్షము వ్యక్తం

- మాజీ కౌన్సిలరు అమరం జైపాల్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**

జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై గుండ్లపోచంపల్లి మాజీ కౌన్సిలర్ అమరం జైపాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్వాగతించారు. న్యాయపరమైన విధానాలను పాటించాల్సిన అవసరాన్ని హైకోర్టు స్పష్టం చేయడం సంతోషకరమన్నారు. బుధవారం జైపాల్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మరియు రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పట్ల ఈరోజు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ గోష్ కమిషన్ పూర్తిగా రేవంత్ రెడ్డి కనుసన్న లో జరిగిందని ఆయనకు అనుకూలంగానే జస్టిస్ గోష్ కమిషన్ లో నిర్ణయం జరిగిందాన్ని దీనిని ఇప్పుడు తెలంగాణ హైకోర్టు కొట్టి వేయడం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని న్యాయం గెలిచి అధర్మము ఒడిందని మరోసారి రుజువైందని జైపాల్ రెడ్డి అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు తెలంగాణ జాతిపీత కేసీఆర్ పై మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోని సంక్షేమ వారోత్సవాల్లో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోని సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ప్రపంచ ధరిత్రీ దినోత్సవం, కళాశాలలోని ఫర్నిచర్ రిపేర్లు చేపించటం జరిగింది అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ, అధ్యాపక బృందం, ఎకో క్లబ్ కమిటీ, ఫర్నిచర్ కమిటీ సభ్యులు తెలియజేశారు.

# మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల నామినేషన్ సందడి




**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 22 :**

యాదగిరిగుట్ట మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా నామినేషన్ దాఖలుకు బుధవారం గడువు ముగిసింది. యాదగిరిగుట్ట మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ లింగస్వామి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ కౌన్సిలర్ గౌలికార్ అరుణ, ఎండీ రహీమా నామినేషన్ దాఖలు చేయగా,సీపీఎం నుండి షేక్ ఉస్మాన్ షరీఫ్, సీపీఐ నుండి బండి జంగమ్మ నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. మిత్రపక్షమైన సిపిఐ, సిపిఎం పార్టీలతో పాటు తమ కాంగ్రెస్ కోఆప్షన్ సభ్యులుగా ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్ మాట్లాడుతూ ఆనాడు గ్రామ పంచాయతీ లోని, ఈనాడు మున్సిపాలిటీగా ఏర్పడిన నాటి నుండి యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా ఉందని ఆయన అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయ పార్టీలు,ఎన్నికల తర్వాత అందరు మున్సిపల్ కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు సమిష్టిగా అభివృద్ధి కార్యక్రమాలతో ఆదర్శవంతంగా యాదగిరిగుట్ట పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. యాదగిరిగుట్టలో స్థానిక పాలకవర్గంలో ఆనాటి నుంచి సిపిఐ ప్రాతినిధ్యం లేని పాలకవర్గం లేదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గొదా శ్రీరాములు అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని సిపిఐ పార్టీ ప్రాబల్యానికి ఇది నిదర్శనం అని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల సాధనలో ప్రజల కోసం సిపిఐ పార్టీ కోసం ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆయన తెలిపారు. యాదగిరిగుట్ట మున్సిపల్ పాలకవర్గంలోకి తొలిసారిగా సిపిఎం అడుగు పెట్టింది. దీనితో సిపిఎం పార్టీలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్,వైస్ చైర్మన్ బరిగె రమ్య రాంచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు బబ్బూరి శ్రీధర్, బుడిగె మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, మండలాధ్యక్షుడు కల్లేపల్లి మహేందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు బందారపు భిక్షపతి, డీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ గిరిధర్,నేతలు గోరేటి రాములు, పేరబోయిన బంగారి,గుండు వెంకటేష్‌గౌడ్, మునికుంట్ల నర్సమ్మ, ఆరె పుష్ప,మద్దూరు భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

---



## భిక్షాటన చేస్తున్న ఇద్దరు చిన్నారులు గుర్తింపు

- చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించిన స్థానిక పోలీసులు

**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 22 :**

యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఇద్దరు చిన్నారులు భిక్షాటన చేస్తున్నట్టు యాదగిరిగుట్ట ట్రాఫిక్ కానిస్టేబుల్ కోటి గుర్తించారు. దెయ్యాల నరేష్ 11 సంవత్సరాలు, జగదీష్ 8 సంవత్సరాలు అనే ఇద్దరు చిన్నారులు యాదగిరిగుట్టలో భిక్షాటన చేస్తున్నట్లు గుర్తించి వెంటనే బుధవారం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న భువనగిరి చైల్డ్ వెల్ఫేర్ అధికారులు హరిబాబు, శ్రీకాంత్‌కు యాదగిరిగుట్టకు రావడంతో ఇద్దరు చిన్నారులను వారికి అప్పగించారు. చిన్నారులను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్‌కు అప్పగించిన యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ ఎలగొండ కృష్ణ,కానిస్టేబుల్ కోటిని ఉన్నతాధికారులు అభినందించారు. ఎక్కడైనా చిన్నారులు భిక్షాటన చేస్తూ కనిపిస్తే వెంటనే 1098 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

---

## ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం



**జయభేరి, ఆలేరు, ఏప్రిల్ 22 :**

ఆలేరు మండలంలోని మందనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం చేసిన పిల్లలమర్రి లావణ్యకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మందనపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం తరపున వారి కుటుంబానికి నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందనపల్లి గ్రామ సర్పంచ్ సిరిమార్తి రేణుక నరసయ్య, ఉప సర్పంచ్ పద్మశ్రీ,వార్డు సభ్యులు కడకంచి శ్రీలత,కృష్ణ, తమ్మడి అంజయ్య, ఊట్కూరి అంజయ్య,కుర్రీ సాయికుమార్,కడకంచి రాజు,జిల్లా యూత్ నాయకుడు ఉట్కూరి సురేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నాయకుడు నోముల వెంకటేష్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు అన్నం సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

---

## దత్తాయపల్లి గ్రామాన్ని సందర్శించిన మహేంద్ర యూనివర్సిటీ విద్యార్థులు




**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 22 :**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామాన్ని మహేంద్ర యూనివర్సిటీ, ఇందిరా మహేంద్ర స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు చెందిన విద్యార్థులు అధ్యాపకులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో డేటా సేకరణలో ప్రత్యక్ష అనుభవం పొందడం గ్రామాల్లో నివసించే ప్రజల సామాజిక, ఆర్థిక వృత్తిపరమైన ఆకాంక్షల ప్రొఫైల్ ను అర్థం చేసుకోవడం కోసం, ఈ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తులో ఉద్యోగాలకు సిద్ధం కావడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. సుమారు 24 మంది విద్యార్థులు నలుగురు అధ్యాపకు సభ్యులు బుధవారం గ్రామాన్ని సందర్శించారు. విద్యార్థులకు శిక్షణలో ఇవ్వడంలో సహాయ పడాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, డాక్టర్ మనోజ్ దాష్, డాక్టర్ జ్యోతి బసు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

---

## ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలు మిన్న




**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 22 :**

ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలు మిన్న అని ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మల్కాపురం, బిలియానాయక్ తండ, బద్దూ తండా, జగ్యతండాలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సదుపాయాల గురించి పాఠశాల ప్రత్యేకతల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే బోధన డిజిటల్ తరగతులు, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం ఉండడం వల్ల గత సంవత్సరం 10వ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించగలిగినట్టు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల్లో ప్రభుత్వ పాఠశాల పట్ల మక్కువ చూపే విధంగా ప్రేరణ కల్పించాల్సిందిగా గ్రామ సర్పంచితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, అంబాజీ, సీఆర్పీ భాస్కర్ పాల్గొన్నారు.

---



## దర్శక నిర్మాత చిట్టిబాబు కన్నుమూత

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 23 :**

పురనేని చిట్టిబాబు పేరు తెలుగు ప్రజలకు సుపరిచితమే. ఈతరం ప్రేక్షకులు ఆయన్ను రాజకీయ విశ్లేషకులుగా చూస్తారు. అయితే ఆయన దర్శకుడు, నిర్మాత, నటులు కూడా! భారతీయ జనతా పార్టీలో కొన్నేళ్ల పాటు కొనసాగారు. తనదైన విశ్లేషణలు, అప్పటి సంగతులు చెబుతూ పాపులరైన చిత్తుబాబు ఇకలేరు.

**పదిహేడేళ్ల వయసులో సినీ ప్రయాణం...**
**డబ్బై ఏళ్ళ వయసులో తిరిగిరాని లోకాలకు!**

ఏప్రిల్ 21... మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు చిట్టిబాబు త్రిపురనేని ఈ లోకం విడిచి వెళ్లారు. ఆయన వయసు 70 ఏళ్ళు. 17 ఏళ్ల వయసులో తన సినీ ప్రస్థానాన్ని ఆయన ప్రారంభించారు. తెలుగు, తమిళ చిత్రసీమల్లోని పలువురు ప్రముఖులతో కలిసి పనిచేశారు.ఏసి తిరులోక్ చందర్, భారతి రాజా, కెఎస్ఆర్ దాస్, కన్నదాసన్, వాలి, ఎంఎస్ విశ్వనాథన్, టి రాజేందర్, శ్రీశ్రీ, ఆచార్య ఆత్రేయ, సిరివెన్నెల సీతారామ శాస్త్రి వంటి మహనీయులతో చిట్టిబాబుకు అనుబంధం ఉంది. దర్శకుడిగా మారక ముందు... తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో మొత్తం 47 సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. దర్శకుడిగా చిట్టిబాబు తొలి సినిమా 'సంతానం'. విజయం సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలు, పురస్కారాలు సాధించింది. ఆ తర్వాత మరో 12 చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. నటుడిగానూ చిట్టిబాబు తెరపై మెరిశారు. తెలుగు, తమిళ భాషల్లో దాదాపు 30 చిత్రాలలో నటించారు. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'రాఖీ' ఈతరం ప్రేక్షకులకు గుర్తుండి ఉంటుంది. చిట్టిబాబు త్రిపురనేనికి భార్య ఉషా లత, ముగ్గురు సంతానం నరోత్తం, భాస్వంత్, మోనిషా ఉన్నారు. ఆయన మరణం పట్ల చిత్రసీమలో పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

---

## పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది

- అమరులను స్మరించుకున్న సీఎం రేవంత్



**జయభేరి, హైదరాబాద్ :**

పహల్గామ్ లాంటి దారుణమైన ఉగ్రవాద దాడులు దేశ ఐక్యతను దెబ్బతీయలేవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పహల్గామ్లో ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా, ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమరులను స్మరించుకున్నారు. వారి త్యాగం ఎప్పటికీ మర్చిపోలేని రుణంగా హృదయాల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు. హేయమైన ఇలాంటి కుట్రలు ఎన్నటికీ సఫలం కావని, వాటిని తిప్పికొట్టడంలో దేశం మరింత దృఢంగా, ఐక్యంగా నిలబడి ధైర్యంగా ఎదుర్కొనేందుకు ప్రతి పౌరుడు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పహల్గామ్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

---

## విద్యా వ్యవస్థ పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- జీన్గరాలలో సరస్వతీ దేవి, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాల ఆవిష్కరణ



**జయభేరి, దేవరకద్ర :**

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి పెట్టిందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర మండలం జీవరాలలో ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సరస్వతి దేవి, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖను గాలికి వదిలేసిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు అలా కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దనే ఉంచుకుని విద్యపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పలు పాఠశాలలను సందర్శించి వాటిలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నానన్నారు. అదే విధంగా కాలినడకన వెళ్లే విద్యార్థులకు సైకిల్ తో పాటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ షూస్ తో పాటు టై, బెల్టులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్

- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి.. అపాయింటెడ్ ను ప్రకటించాలి
- ఆర్టీసీలోని కార్మిక సంఘాలను పునరుద్ధరించి, యూనియన్ ఎన్నికలను వెంటనే జరిపించాలని డిమాండ్ : సిపిఐ, ఏఐటీయూసీ




**జయభేరి, యాదగిరిగుట్ట :**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ కార్మికులు చేస్తున్నా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలో భాగంగా యాదగిరిగుట్ట డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని అన్నారు. 2021, 2025 సంవత్సరం పెండింగ్ లో ఉన్న వేతన సవరణ పాటు పిఆర్సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కారించకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, కొల్లూరి రాజయ్య, పేరబోయిన మహేందర్, గోరేటి రాములు, కల్లేపల్లి మహేందర్, పేరబోయిన బంగారి, సామల భాస్కర్, ఆర్టీసీ జేఏసీ నాయకులు మంగ, ప్రభాకర్ రెడ్డి, సోకం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

---

## ఆర్టీసీ సమ్మె ప్రయాణికుల ఇబ్బందులు




- నిర్మానుష్యంగా మారిన యాదగిరిగుట్ట బస్టాండ్
- డిమాండ్లు పరిష్కరించేవరకు సమ్మె చేస్తామంటున్న ఆర్టీసీ కార్మికులు

**జయభేరి, యాదగిరిగుట్ట :**

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ డిమాండ్ల పరిష్కరించాలని కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపిన ఆర్టీసీ కార్మికులు. ప్రభుత్వంతో చర్చలు విఫలమవడంతో యాదగిరిగుట్ట డిపో నుండి బుధవారం తెల్లవారుజాము నుంచే బస్సులు పూర్తిగా నిలిచిపోయాయి. యాదగిరిగుట్ట డిపోకు తాళాలు వేసి ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆర్టీసీ కార్మికులు స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట డిపో నుండి ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో దాదాపు 17 మండలాలకు బస్సులు వెళ్లకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో యాదగిరిగుట్ట డిపోతో పాటు భువనగిరి ఇతర బస్టాండ్‌లు పూర్తిగా నిర్మానుష్యంగా మారాయి.

ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో ఇదే అదునుగా చేసుకొని ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు ప్రయాణికుల నుండి భారీగా దోచుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సు చార్జీల కంటే డబుల్ వసూలు చేస్తున్నారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. పలువురు విద్యార్థులు, ఉద్యోగులు బస్టాండ్ వరకు వెళ్లి తిరిగు ప్రయాణమవగా ప్రైవేట్ ట్రావెల్స్ బాదుడు భరించలేక లబోదిబోమంటున్నారు. విద్యార్థులకు పరీక్షల సమయం కావడంతో చాలా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఉదయం బస్టాండ్ దగ్గరకు వచ్చిన విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.



## తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె..

- **ప్రైవేట్ వాహనాల ఛార్జీల బాదుడు..**
- **కిటకిటలాడుతున్న హైదరాబాద్ మెట్రో..**


**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) మరియు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన చర్చలు ఫలించకపోవడంతో, రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె ఉధృత రూపం దాల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచే కార్మికులు సమ్మెకు దిగడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, బీహెచ్ఈఎల్ వంటి కీలక డిపోలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన కేంద్రాల్లో ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసనలు చేపట్టారు. బస్సులు డిపోల నుంచి బయటకు రాకుండా కార్మికులు అడ్డుకోవడంతో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థ కుప్పకూలింది.

సమ్మె నేపథ్యంలో పలు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల వద్ద పోలీసులకు, కార్మికులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. సంగారెడ్డిలో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పోలీసుల పహారాలో బస్సులను నడపడానికి ప్రయత్నించగా, కార్మికులు వాటిని తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ క్రమంలో పటాన్‌చెరు వద్ద నిరసనకారులను చెల్లాచెదురు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. భారీ భద్రత నడుమ కొన్ని బస్సులను రోడ్లపైకి తెచ్చినప్పటికీ, కార్మికుల ఆందోళనల వల్ల పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి రాలేదు.

బస్సులు లేకపోవడంతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన బస్టాండ్లు నిశ్శబ్దంగా మారగా, గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రజలు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడుతున్నారు. సికింద్రాబాద్ వంటి రద్దీ ప్రాంతాల్లో RTC బస్సుల కొరత వల్ల మెట్రో రైళ్లు, సెట్విన్ బస్సులు, ఎంఎంటిఎస్ రైళ్లలో రద్దీ విపరీతంగా పెరిగింది. ఇదే అదనుగా భావించిన ఆటో రిక్షాలు, ప్రైవేట్ కార్ల నిర్వాహకులు ప్రయాణికుల నుంచి భారీగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వం, జేఏసీ మధ్య ప్రతిష్టంభన కొనసాగుతుండటంతో, ఈ సమ్మె ఎప్పుడు ముగుస్తుందో తెలియక జనం ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు సమ్మెను వెంటనే విరమించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ వ్యవస్థ పరిరక్షణతో పాటు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను ఆపాలని ఆయన కోరారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కమిటీకి నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. మొత్తం 32 అంశాల్లో 29 సమస్యలు వెంటనే పరిష్కరించదగినవని ఆయన వివరించారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు వంటి కొన్ని కీలక అంశాలు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ విషయాలపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో చర్చిస్తామని మంత్రి పొన్నం వెల్లడించారు.

## జూబ్లీ బస్ స్టేషన్ లో నిలిచిపోయిన బస్సులు



**జయభేరి, సికింద్రాబాద్ :**

ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో జూబ్లీ బస్ స్టేషన్ లో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. పికెట్, కంటోన్మెంట్, రాణిగంజ్ డిపోలలో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉత్తర తెలంగాణ కు వెళ్లాల్సిన బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీర్చాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం విజయవంతం కావడానికి ఆర్టీసీ కార్మికులే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించాలని అన్నారు. గతంలో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఆర్టీసీలో పని చేసే వారికి పిఆర్సి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చలేదని ఇదే విషయమే పలుమార్లు అధికారులతో చర్చలు జరిగినప్పటికీ విఫలం కావడంతోనే తాము సమ్మె నోటీసు వచ్చి సమ్మెకు దిగినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**జయభేరి, వరంగల్ :**

మట్టెవాడ పరిధిలో నివాసం ఉంటూ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్న సంగీత(33) ఆత్మహత్య చేసుకుంది. సోమవారం సీఎం బందోబస్తు విధులు ముగించుకుని మంగళవారం మట్టెవాడలోని నివాసానికి చేరుకుని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పని చేసే చోట శ్రీధర్ అనే కానిస్టేబుల్ వేధింపులే ఆత్మహత్యకు కారణమని సూసైడ్ లెటర్ రాసింద. మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏసీబీ వలలో కోర్టు సిబ్బంది

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :**

తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో ముగ్గురు ఉద్యోగులు ఏసీబీకి చిక్కారు. కోర్టులో ఒక సర్టిఫికెట్ కాపీ మీద ముద్ర వేసేందుకు మూడు వారాలు తిప్పించారు. ఒకరి మీద ఒకరు చెప్పుకున్నారు. చివరకు ఐదు వేలు ఇస్తే ముద్ర వేస్తామన్నారు. విసిగిపోయిన బాధతులు ఏసీబీని ఆశ్రయించాడు. పక్కగా ప్లాన్ చేసి ఏసీబీ వీళ్లను అరెస్ట్ చేసింది. ఏసీబీ అధికారులను చూడటంతోనే ఇద్దరు మహిళా ఉద్యోగులు భోరున ఏడుస్తూ కుర్చీలో కూలబడిపోయారు. ఇద్దరు మహిళా ఉద్యోగులను, మరో ఉద్యోగిని ఏసీబీ అరెస్ట్ చేసింది.

# ఘనంగా మహిళా డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు

- **విద్యార్థునికి మెమోటో అందజేస్తున్న కళాశాల అధ్యాపకులు, ముఖ్యఅతిథులు**

**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 22 :**



గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది.ఈ వార్షికోత్సవానికి కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహించి కళాశాల వార్షిక నివేదిక చదివి వినిపించారు. ఈ కళాశాలకు 45 కంప్యూటర్స్, యుపిఎస్ రెండు ప్రొజెక్టర్లు తీసుకురావడం అంతేగాక డిగ్రీ ప్రథమ సంవత్సరంలో 345 మంది అడ్మిషన్లు జరిగాయి. 2025 26 విద్యా సంవత్సరంలో 81 శాతం మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మెగా జాబ్ మేళాలో విద్యార్థినిలు టెక్ మహేంద్ర, ఇంపోషిప్, జయాలుకాస్,ముత్తూట్ ఫైనాన్స్ మొదలగు సంస్థలలో 105 మంది ఉద్యోగాలు సాధించారు. అంతేగాక కళాశాల సీ.పీ.డీ.సీ మెంబర్ అయిన డాక్టర్ శైలజ 25 కుర్చీలు ,మరో సిపిడిసి మెంబర్ ఆరాధన జార్జి 40 స్టూల్స్ ను ఇచ్చారని వివరించారు. కళాశాల ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ చైర్మన్ ఎస్ రాజమౌళి, డాక్టర్ శైలజ, డాక్టర్ నరేష్ బాబు ,డాక్టర్ శ్రీధర్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పరమేశ్వర చారి, సామాజిక సేవాకర్త టి లక్ష్మణ్ కళాశాల వార్షికోత్సవాన్ని ఉద్దేశించి విద్యార్థునుల లక్ష్యం, ప్రవర్తన ,సమాజం పట్ల గౌరవం, భవిష్యత్తు ప్రణాళిక మొదలగు జీవిత సత్యాల గురించి ప్రసంగించారు. వార్షికోత్సవంలో భాగంగా బీఏ, బీకాం, బీఎస్సీలలో టాపర్లుగా నిలిచిన భానుజా, ఫిరదౌస్ బేగం,పల్లవి, సింధు, శబ్నం,శ్రావణి ,శ్యామశ్రీ ,భవాని, రచన విద్యార్థినులకు డాక్టర్ శైలజ, డాక్టర్ నరేష్‌బాబు ,డాక్టర్ శ్రీధర్, పరమేశ్వర చారి ,లక్ష్మణ్, ఆరాధన జార్జి, డాక్టర్ సుజాత, పి విజయ లక్ష్మి, జెవిఆర్ అర్చన ,రమణారెడ్డి ,డాక్టర్ పద్మావతి డొనేట్ చేసిన బంగారు పతకాలతో సత్కరించారు. అంతేగాక బెస్ట్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ,మెగా సెల్ఫ్ డిఫెన్స్, బేసిక్ కంప్యూటర్స్, వర్క్ షాప్, ఫైనాన్షియల్ అకౌంట్స్ ,ఫుడ్ ఫెస్టివల్, లిటరరీ కల్చరల్, స్పోర్ట్స్ లలో గెలుపొందిన విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులను ప్రధానం చేశారు.ఇందులో భాగంగా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సీపీడీసీ మెంబర్స్ సమక్షంలో కళాశాల మ్యాగ్జిన్ ను కూడా ఆవిష్కరించారు. తదుపరి విద్యార్థినులు ఫేర్వెల్ పార్టీలో నృత్యాలు ,పాటలు, ఏకపాత్రాభినయం మొదలగు ఆహ్లాదకరమైన విన్యాసాలతో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ వార్షికోత్సవంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె ఉమారాణి, ఐకిపిసి కోఆర్డినేటర్ ఎంఎం లక్ష్మి ,స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ శోభారాణి, పేరెంట్స్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




## తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- **సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం**
- **బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్**

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణంలో తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె చేస్తున్న సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం దేవరకొండ నియోజకవర్గం ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేనిఫెస్టోలో తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, యూనియన్ లను పునరుద్ధరిస్తామని, 2021 నుండి 2025 వేతన సవరణ, అవుట్సోర్సింగ్ ,కాంటాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ,ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నడిపిస్తామని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ తక్షణమే చెల్లిస్తామని, పెంచిన పనిభారాలను తగ్గించాలని, తక్షణమే ఈ డిమాండ్లను ఆర్టీసీ యాజమాన్యం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తూ కార్మికులకు అండగా ఉంటూ సమస్యలు సాధించేవరకు ఉద్యమాలు చేస్తామని ఉద్యమాల ద్వారానే సాధించుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ భాషా చౌహాన్, పున్న వెంకటేష్ నేత, పెరికేటి శ్రీనివాస్ చారి ,భీమగోని శివ గౌడ్ తెలంగాణ ఆర్టీసీ జెఏసి చైర్మన్ ఇరగ దండ్ల శీను, వైస్ చైర్మన్ ఓరుగంటి రమేష్‌గౌడ్, కోశాధికారి నరహరి ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 22 :**




రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం పెద్దతండ, పల్లె పహాడ్ గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో మాదాపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని అమ్మాలని, దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. రైతులకు రెండు విడతలుగా ప్రభుత్వం రైతుబంధు నిధులను విడుదల చేసిందని అన్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని అమ్మి సరసమైన ధరను పొందాలని అన్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిర్వాహకులు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, తాసిల్దార్ పి.రవికుమార్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ మహిళా మండల అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, సర్పంచులు భూక్య రాజారాం నాయక్, పొంగల పవనీత బాలకృష్ణ, ధరావత్ రమేష్ నాయక్, బానోతు సతీష్ నాయక్, ధరావత్ కమిలి సురేష్, సీత రాజు, సోమల వెంకటేశం, ఏపీఎం రమణ, పిఏసిఎస్ సీఈఓలు నారా రమేష్, బోరేడ్డి జనార్దన్ రెడ్డి, శ్రీరామ్ మూర్తి, బాలు యాదవ్, నాయకులు, రైతులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడీ ప్రీస్కూల్ చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ

- **పౌష్టికాహారం,పాఠ్యపుస్తకాలను అందజేసిన మంత్రి సీతక్క**

**జయభేరి, ములుగు, ఏప్రిల్ 22 :**



ములుగు జిల్లా మంగపేట గ్రామ పరిధిలోని శాంతినగర్ గుత్తి కోయగుంపులోని అంగన్వాడీ చిన్నారులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి, సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి అదనపు జత ఏకరూప దుస్తులను, మూడేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం 'బాలామృతం', ప్రీప్రైమరీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వేసవికాలం దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పిల్లలను పనిచేసే ప్రదేశాలకు తీసుకెళ్లవద్దని సూచించారు. గుత్తి కోయ ఆవాసంలోని పిల్లలు సక్రమంగా అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతూ ఆటపాటలతో కూడిన ప్రీప్రైమరీ విద్యను అభ్యసించాలని కోరారు అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్య ప్రభుత్వం అందిస్తుందని, ప్రతి చిన్నారి శారీరక, మానసిక వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు.



## నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

- **1978లో తొలిసారిగా ఎమ్మెల్యేగా శాసనసభకు ఎన్నిక**
- **1984లో ఏపీ సీఎంగా బాధ్యతలు**

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 22 :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు (90) కన్నుమూశారు. గత కొంతకాలం నుంచి వయసురీత్యా అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల రాజకీయ ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం పంజాగుట్ట శ్మశానవాటికలో భాస్కర్ రావు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం ఏపీలో పౌరసరఫరాలశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించిన భాస్కరరావు, వృత్తిరీత్యా న్యాయవాదిగా తన జీవితాన్ని ప్రారంభించి, ఆపై రాజకీయాల్లోకి ప్రవేశించారు. నాదెండ్ల భాస్కరరావు రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీతో ప్రారంభమైంది. 1978లో తొలిసారిగా ఎమ్మెల్యేగా శాసనసభకు ఎన్నికైన ఆయన, మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 1982లో నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు, ఆ పార్టీ ఏర్పాటులో భాస్కరరావు కీలక పాత్ర పోషించారని తెలిసిందే. ఎన్టీఆర్ తర్వాత పార్టీలో పవర్‌ఫుల్ లీడర్‌గా ఎదిగారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించాక, ఎన్టీఆర్ కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

**1984లో ఏపీ సీఎంగా బాధ్యతలు..**

నాదెండ్ల భాస్కర్ రావు జీవితంలో అత్యంత కీలకమైన, వివాదాస్పదమైన ఘట్టం 1984లో చోటుచేసుకుంది. సీఎం ఎన్టీఆర్ వైద్యం కోసం అమెరికాకు వెళ్లి సమయంలో, గవర్నర్ రామ్ లాల్ మద్దతుతో ఆయన ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేవలం ఒక నెల రోజులు (31 రోజులు) మాత్రమే సీఎం పదవిలో కొనసాగారు. రాష్ట్ర చరిత్రలో అతి తక్కువ కాలం ఆ పదవిలో కొనసాగిన సీఎంగా నిలిచారు. ఆ తర్వాత భాస్కర్ రావు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి, 1998లో ఖమ్మం ఎంపీగా విజయం సాధించారు. ఆ తరువాత వయసురీత్యా అనారోగ్య సమస్యలతో యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శాసనసభ్యుడిగా, మంత్రిగా, ఎంపీగా సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని, భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. నాదెండ్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**విజయసాయి రెడ్డి సంతాపం**

ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా నివాళులర్పించారు. నాదెండ్ల భాస్కరరావు మరణ వార్త తనను ఎంతో కలిచివేసిందన్నారు. "ఎన్.టి. రామారావు, మర్రి చెన్నారెడ్డి, టి. అంజయ్య గారి మంత్రివర్గాల్లో నాదెండ్ల భాస్కరరావు మంత్రిగా పనిచేశారు. అలాగే లోక్‌సభ సభ్యునిగా సేవలందించారని' విజయసాయి రెడ్డి గుర్తు చేసుకున్నారు.




# పుంజుకున్న రాజస్థాన్..

బంతి ఆధిపత్యం చెలాయించిన ఏకనా స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు సత్తాచాటి ఆ జట్టును మళ్లీ విజయాల బాట పట్టించారు. బుధవారం ఆ జట్టు.'లో స్కోరింగ్ థ్రిల్లర్'గా సాగిన పోరులో ఆతిథ్య లక్నో సూపర్ జెయింట్స్‌ను 40 రన్స్ తేడాతో ఓవడించి రెండు పరాభవాల తర్వాత విజయాన్ని అందుకుంది. రాయల్స్ నిర్దేశించిన 160 పరుగుల ఛేదనలో లక్నో 18 ఓవర్లలో 119 వద్దే ఆగిపోయింది. మిచెల్ మార్ష్ (41 బంతుల్లో 55, 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. రాయల్స్ బౌలర్ల లో ఆర్చర్ (3/20) మూడు వికెట్లు తీయగా బ్రిజేష్, బర్గర్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. తొలుత లక్నో బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో రాయల్స్‌ను 20 ఓవర్లకు 159/6కే పరిమితం చేశారు. రవీంద్ర జడేజా (29 బంతుల్లో 43 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఈ విజయంతో రాజస్థాన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకగా లక్నో 9వ స్థానానికి పడిపోయింది. ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేశామన్న ఆనందం లక్నో జట్టులో ఆవిరవడానికి పెద్దగా సమయం పట్టలేదు. ఛేదనలో ఆ జట్టు 3 ఓవర్లు కూడా పూర్తికాకముందే బదోని, కెప్టెన్ పంత్, మార్క్మ్ వికెట్లను కోల్పోయింది. ఈ ముగ్గురూ సున్నాలే చుట్టి పెవిలియన్ చేరడం గమనార్హం. తొలి ఓవర్లో లేని పరుగు కోసం యత్నించి బదోని రనౌట్ అవగా బర్గర్ బౌలింగ్‌లో పంత్.. జురెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. మూడో ఓవర్లో ఆర్చర్.. మార్‌క్‌మ్రనూ వెనక్కి పంపడంతో లక్నో పవర్ ప్లేలో 31/3తో ఉంది. పూరన్ (25 బంతుల్లో 22), మార్ష్ వంటి భారీ హిట్టర్లు క్రీజులో ఉన్నా ఆ జట్టు రన్‌రేట్ 11 ఓవర్ దాకా 6 లోపే నమోదైంది. పదో ఓవర్ నాలుగో బంతికి జడ్డూ.. పూరన్‌ను ఔట్ చేసి ఆ జట్టును మరింత దెబ్బతీశాడు. ఈ క్రమంలో గేర్ మార్చిన మార్ష్.. జడ్డూ ఓవర్లో రెండు బౌండరీలు కొట్టగా ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన హిమ్మత్ ఓ సిక్స్ బాది ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చే యత్నం చేశాడు. కానీ బిష్ణోయ్ 15వ ఓవర్లో హిమ్మత్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. బర్గర్ 16వ ఓవర్లో సిక్స్‌తో మార్ష్ 39 బంతుల్లో ఈ సీజన్‌లో తొలి హాఫ్‌సెంచరీని సాధించాడు. కానీ రెండు బంతుల తర్వాత అతడే.. పరాగ్‌కు క్యాచ్ ఇవ్వడంతో రాయల్స్ గెలుపు రేసులోకి వచ్చింది. చివరి 4 ఓవర్లలో లక్నో విజయానికి 49 రన్స్ అవసరమవగా బ్రిజేష్ బౌలింగ్‌లో ముకుల్ (7).. ఎక్స్‌ట్రా కవర్స్‌లో పరాగ్‌కు క్యాచ్ ఇవ్వడంతో లక్నో ఓటమి ఖాయమైంది. అదే ఓవర్లో బ్రిజేష్.. షమీ(6)నీ బౌల్డ్ చేశాడు. ఆర్చర్ లోయరార్డర్ పనిపట్టాడు. బౌలర్లకు అనుకూలించే లక్నో పిచ్‌పై ఆ జట్టు బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులేసి రాయల్స్‌ను కట్టడిచేశారు. అదీగాక రాజస్థాన్ ఓపెనర్ల మీద ఎంత ఆధారపడిందో తెలియడానికి గత మ్యాచ్ మాదిరిగానే నేటి పోరూ మరో ఉదాహరణ. జైస్వాల్ (22), సూర్యవంశీ (8)తో పాటు ధ్రువ్ జురెల్ డకౌట్ అవగానే పరాగ్ సేన మరోమారు తక్కువ స్కోరుకే పరిమితమైంది. షమీ మూడో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టిన జైస్వాల్.. నాలుగో బంతికి పంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. జురెల్ కూడా అతడినే అనుసరించాడు. ఆ తర్వాతి ఓవర్లోనే వండర్ కిడ్ వైభవ్.. మోహ్సిన్ బంతిని భారీ షాట్ ఆడబోయి కవర్స్‌లో దిగ్వేశ్ రాతికి చిక్కాడు. ఈ క్రమంలో కెప్టెన్ పరాగ్ (20), హెట్‌మెయర్ (22) ఐదు ఓవర్ల పాటు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నా ధాటిగా ఆడలేకపోయారు. ప్రిన్స్ తన రెండో స్పెల్‌లో పరాగ్‌ను ఔట్ చేయడంతో రాయల్స్ కష్టాలు రెట్టింపయ్యాయి. మయాంక్ బౌలింగ్‌లో 6,4తో జోరుమీద కనిపించిన హెట్‌మెయర్.. మోహ్సిన్ 11వ ఓవర్లో ప్రిన్స్‌కు క్యాచ్ ఇవ్వడంతో రాయల్స్ ఐదో వికెట్ కోల్పోయింది. రాయల్స్ భారీ ఆశలు పెట్టుకున్న డొనొవన్ ఫెరీరా (20) కూడా క్రీజులో నిలిచేందుకు తంటాలుపడ్డాడు. 16 ఓవర్లలో 110/6తో ఉన్న రాయల్స్ ఆ మాత్రం స్కోరైనా చేసిందంటే అది జడేజా, ఇంపాక్ట్ ప్లేయర్ శుభమ్ దూబే (19)ల పోరాటమే. మయాంక్ ఆఖరి ఓవర్లో జడ్డూ.. రెండు బౌండరీలు, సిక్స్‌తో ఆ జట్టుకు గౌరవప్రదమైన స్కోరునందించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

రాజస్థాన్: 20 ఓవర్లకు 159/6 (జడేజా 43*, జైస్వాల్ 22, మోహ్సిన్ 2/17, ప్రిన్స్ 2/29); లక్నో: 18 ఓవర్లకు 119 ఆలౌట్ (మార్ష్ 55, పూరన్ 22, ఆర్చర్ 3/20, బ్రిజేష్ 2/18)





# భారత్ 192/4

దక్షిణాఫ్రికా జరుగుతున్న టీ20 సిరీస్‌లో భాగంగా జోహన్నెస్‌బర్గ్ వేదికగా జరిగిన మూడో టీ20లో భారత్.. మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు చేసింది. దక్షిణాఫ్రికా జరుగుతున్న టీ20 సిరీస్‌లో భాగంగా జోహన్నెస్‌బర్గ్ వేదికగా జరిగిన మూడో టీ20లో భారత్.. మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు చేసింది. ఫుల్‌ఫామ్‌లో ఉన్న షెఫాలీ వర్మ (46 బంతుల్లో 64, 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (38 బంతుల్లో 66, 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (37) రాణించి ప్రత్యర్థి ఎదుట భారీ స్కోరును నిలిపారు.

## ఒకే గ్రూపులో భారత్, బంగ్లా

### మే 25 నుంచి సాఫ్ టోర్నీ

దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య(సాఫ్) మహిళల టోర్నీకి వేళయైంది. మార్గవో(గోవా) వేదికగా మే 25 నుంచి జూన్ 6వ తేదీ వరకు టోర్నీ జరుగనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను బుధవారం ఢాకా(బంగ్లాదేశ్)లో విడుదల చేశారు. టోర్నీలో మొత్తం ఆరు జట్లు బరిలో ఉన్నాయి. ఆతిథ్య భారత్ సహా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్, మాల్దీవులు పోటీపడుతున్నాయి. ప్రస్తుత ఫిఫా ర్యాంకింగ్స్‌ను అనుసరించి గ్రూపులను ప్రకటించారు. ఐదుసార్లు చాంపియన్ భారత్, బంగ్లాదేశ్, మాల్దీవులు గ్రూపుబీలో ఉన్నాయి. టోర్నీలో రికార్డు స్థాయిలో ఆరోసారి టైటిల్‌పై కన్నేసిన భారత మహిళల జట్టుకు డిఫెండింగ్ చాంపియన్ బంగ్లా నుంచి దీటైన పోటీ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2016 తర్వాత రెండోసారి ఆతిథ్యమిస్తున్న భారత్..మరోమారు టైటిల్ లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నది.



# టీమిండియా క్రికెటర్‌తో విడాకులు..



నటాషా తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఆ ఫోటోలలో ఆమె ఫిట్‌నెస్ స్పష్టంగా కనిపిస్తోంది. ఫోటోను షేర్ చేస్తూ, ఆమె క్యాప్షన్‌లో 'క్రమశిక్షణే నా గర్వం' అని రాసింది. నటాషా స్వతహాగా భారతదేశానికి చెందిన వ్యక్తి కారు. ఆమె సెర్బియా నుండి భారతదేశానికి వచ్చింది. ఎంతో కష్టపడి ఆమె ఇక్కడికి చేరుకుంది. భారతదేశానికి వచ్చిన తర్వాత, ఆమె పేరు అలీ గోనితో ముడిపడింది. ఈ సంబంధం ఎక్కువ కాలం నిలవలేదు. అలీ, నటాషా 'నాచ్ బలియే 9' షోలో పాల్గొన్నారు. అలీతో విడిపోయిన తర్వాత, నటాషా సీనియర్ క్రికెటర్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు దగ్గరైంది. వారిద్దరూ మొదట ప్రేమించుకుని, ఆ తర్వాత పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. కానీ వీరిద్దరి బంధం ఎక్కువ రోజులు సాగలేదు. కొన్నాళ్ల క్రితమే హార్దిక్, నటాషాలు విడిపోయారు. వారి వివాహ బంధం విచ్ఛిన్నమైంది. ఇప్పుడు అగస్త్య నటాషాతో ఉన్నాడు. నటాషా ఇప్పుడు మోడలింగ్‌తో పాటు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కూడా పనిచేస్తోంది. ఆమె ఫిట్‌నెస్‌పై ఎక్కువగా దృష్టి పెడుతుంది. ఆమె జిమ్ నుండి ఫోటోలు, వీడియోలను పంచుకుంటుంది.



# సల్మాన్ ఖాన్ – వంశీ పైడిపల్లి మూవీ షురూ..

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ SVC63 ముంబైలో ఘనంగా ప్రారంభమైంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది సల్మాన్ ఖాన్ కెరీర్‌లోనే ఒక ప్రత్యేకమైన యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోందని సమాచారం. ఇక మొదటిసారి సల్మాన్ ఖాన్‌ను వంశీ పైడిపల్లి డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది.

# ఇక నటనపై దృష్టి?



దర్శకుడు శంకర్ పేరు వినగానే ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలు గుర్తుకొస్తాయి. సామాజిక అంశాలను ఎంచుకొని వాణిజ్య పంథాలోనే భారీ హంగులతో సినిమాల్ని నిర్మించడం ఆయన శైలి. అయితే దర్శకుడిగా కొన్నేళ్లుగా ఆయన వరుస వైఫల్యాలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో దర్శకత్వానికి తాత్కాలికంగా బ్రేక్‌నిచ్చి నటనపై దృష్టిపెట్టాలని నిర్ణయించుకున్నారట. సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మాణంలో శిబి చక్రవర్తి దర్శకత్వం వహించే చిత్రంలో శంకర్ విలన్ పాత్రను పోషించనున్నారని చెన్నై ఫిల్మ్‌నగర్ టాక్. ఇందులో ఆయన స్టైలిష్ విలన్‌గా కనిపించనున్నారని సమాచారం. రజనీకాంత్, కమల్‌హాసన్‌తో శంకర్‌కు మంచి అనుబంధం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సినిమాతో మరలా నటుడిగా అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు శంకర్ సిద్ధమయ్యారని అంటున్నారు. సహాయ దర్శకుడిగా పనిచేస్తున్న రోజుల్లో శంకర్ కొన్ని చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించారు. తాను డైరెక్ట్ చేసిన శివాజీ, రోబో, నన్బన్ చిత్రాల్లో అతిథి పాత్రల్లో మెరిశారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన నటనపై దృష్టి పెట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# చిరంజీవికి విలన్‌గా యంగ్ హీరోయిన్..





మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారు. ఇటీవలే మన శంకరవరప్రసాద్ గారు సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. సంక్రాంతికి విడుదలైన ఈ మూవీకి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. తాజాగా దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి ఒక భారీ ప్రాజెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ విజయం సాధించడంతో, ఈ కొత్త సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక ఆసక్తి కరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో టాలీవుడ్ యంగ్ బ్యూటీ డింపల్ హయాతి ఒక కీలకమైన పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అది కూడా సాదాసీదా పాత్ర కాదు, మెగాస్టార్‌ను ఢీకొట్టే పవర్‌ఫుల్ నెగటివ్ రోల్ అని తెలుస్తోంది. సాధారణంగా గ్లామరస్ పాత్రలకు పరిమితమయ్యే డింపుల్, ఈ సినిమాలో విలనిజం పండించబోతుండటం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యింది. తన నటనతో, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఈ పాత్రకు ఆమె పూర్తి న్యాయం చేస్తుందని చిత్ర బృందం భావిస్తోంది. దర్శకుడు బాబీ తన సినిమాల్లో ప్రతినాయక పాత్రలను చాలా పవర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తుంటారు. చిరంజీవితో చేయబోయే ఈ సినిమాలో కూడా విలన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉందట. ఒక వైపు చిరంజీవి మాస్ మేనరిజమ్స్, మరోవైపు డింపల్ హయాతి నెగటివ్ షేడ్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే, డింపల్ కెరీర్‌కు ఇది ఒక పెద్ద మలుపు అవుతుందని చెప్పవచ్చు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. చిరంజీవి తన ఇతర ప్రాజెక్ట్‌లను పూర్తి చేసిన వెంటనే ఈ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది. ఈ చిత్రానికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాలో మెగాస్టార్ వింటేజ్ లుక్‌లో కనిపిస్తారని సమాచారం. మొత్తానికి, బాబీ తన మార్క్ మేకింగ్‌తో చిరంజీవిని మరోసారి వెండితెరపై పవర్‌ఫుల్‌గా చూపించడానికి సిద్ధమవుతుండగా, డింపల్ హయాతి పాత్ర ఇండస్ట్రీలో పెద్ద చర్చకు దారితీస్తోంది. ఇదిలా ఉంటే.. ఈ ఏడాది సంక్రాంతికి రవితేజ సరసన భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చింది. అయితే ఈ చిత్రానికి మిశ్రమ స్పందన వచ్చింది. చాలా కాలంగా తెలుగులో వరుస సినిమాలతో అలసిస్తున్న ఈ బ్యూటీకి ఇప్పటికీ సరైన బ్రేక్ రాలేదు. ఇక ఇప్పుడు చిరంజీవి సినిమాలో ఏకంగా నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనుంది అమ్మడు. ప్రస్తుతం డింపుల్ హయాతి.. హీరో శర్వానంద్ సరసన భోగి అనే చిత్రంలో నటిస్తుంది. ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు.

# విష్ణు ప్రియ, అనన్య బాటలో మరో బిగ్ బాస్ బ్యూటీ..



ఇటీవల కాలంలో ఇన్ స్టా గ్రామ్ పెయిడ్ సబ్ స్క్రిప్షన్ అంటూ సెలబ్రిటీలు తెగ హంగామా చేస్తున్నారు. ఎక్స్ క్లూజివ్ కంటెంట్ అంటూ గ్లామరస్ ఫొటోస్, వీడియోలను షేర్ చేస్తూ భారీ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇటీవల విష్ణు ప్రియ, అనన్య నాగళ్ల ఈ జాబితాలో చేరారు. తాజాగా మరో బిగ్ బాస్ బ్యూటీ అషూ రెడ్డి కూడా ఈ లిస్ట్ లో చేరిందని తెలుస్తోంది. 'అందరూ సబ్ స్క్రైబ్ చేసుకోండి.. ఎక్స్‌క్లూజివ్ కంటెంట్.. వీడియోలు' అని నవ్వుతూ ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియో ఒకటి ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. అయితే అషూ రెడ్డి నిజంగానే ఇన్ స్టా గ్రామ్ సబ్ స్క్రిప్షన్ ప్రారంభించారా లేదా అనేది తెలియాల్సి ఉంది. టిక్ టాక్ వీడియోలతో కెరీర్ ప్రారంభించిన అషూ రెడ్డి బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షోతోనూ బాగా పాపులర్ అయ్యింది. అలాగే సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మతో తీసిన బోల్డ్ ఇంటర్వ్యూ తో కూడా బాగా వైరల్ అయ్యింది. ఆ మధ్యన కొన్ని సినిమాల్లోనూ నటించిన ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం పలు టీవీ ప్రోగ్రామ్స్ తో బిజీ బిజీగా ఉంటోంది. ఇక అషూరెడ్డికి సోషల్ మీడియాలోనూ భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇన్ స్టా గ్రామ్ లో ఫుల్ యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ విషయాలన్నింటినీ ఇందులో షేర్ చేస్తుంటుంది. అలాగే గ్లామరస్ ఫొటోస్, వీడియోలను కూడా షేర్ చేస్తుంటుంది. వీటికి నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందనలు వస్తుంటాయి. ఒక వేళ ఈ ముద్దుగుమ్మ ఇన్ స్టా గ్రామ్ సబ్ స్క్రిప్షన్ కనుక పెడితే భారీ స్థాయిలో ఫాలోవర్లు పెరుగుతారని అభిమానులు భావిస్తున్నారు. ఎందుకంటే విష్ణు ప్రియ విషయానికి వస్తే.. ఈ పెయిడ్ సబ్ స్క్రిప్షన్ కు ముందు ఆమెకు చాలా తక్కువ మంది సబ్ స్క్రైబర్లు ఉండే వారు. ఎప్పుడైతే కేసు నమోదు అయ్యిందే ఒక్కసారిగా అషూరెడ్డి సబ్ స్క్రైబర్ల సంఖ్య భారీగా పెరిగిపోయింది. ఇప్పుడు అషూ రెడ్డి విషయంలోనూ ఇదే జరుగుతుందని ఆమె ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఇప్పుడు ఇన్ స్టా గ్రామ్ న్ స్టా గ్రామ్ పెయిడ్ సబ్ స్క్రిప్షన్ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**